# ప్రత్యక్ష సాక్షి
తెలుగు దినపత్రిక

RNI No.APTEL/2011/38267

సంపుటి : 15 సంచిక : 306 శుక్రవారం 26-06-2026

ఎడిటర్ : కందుకూరి పరమేశ్వర్‌రావు, M.A. పేజీలు : 4 వెల : రూ2/-



**విలేకరులు కావలెను**

ప్రత్యక్ష సాక్షి దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ ప్రాంతంలోని అన్ని జిల్లాలు మరియు నియోజకవర్గాల నుంచి పనిచేయటకు విలేకరులు కావలెను. ప్రశ్నించే తత్వంతో పాటు నిజాన్ని నిర్భయంగా రాయగలిగే సత్తా ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి : సెల్ : 99892 88546


## నల్గొండను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతాం

### రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

(నల్లగొండ)

నల్గొండ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచే మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కోటి 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న నల్గొండ ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ మరియు ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అంతేకాక 2 సిటీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పట్టణంలోని మహిళలు షాపింగ్, ఇతర అవసరాల కోసం రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని సిటీ బస్సు సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే మెడికల్ కాలేజ్ విద్యార్థులు ఆస్పత్రికి చేరుకోవడానికి ఆటోలపై ఆధారపడాల్సి వచ్చేదని, ఇకపై వారు సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంటుందని చెప్పారు.

సిటీ బస్సు సర్వీసులు చెరువుగట్టు--ఎస్ఎల్‌బీసీ మార్గంతో పాటు ధరవేశి పురం నుంచి దుప్పలపల్లి వరకు నడిచేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. నల్గొండకు అదనంగా 30 బస్సులు కేటాయించడం జరిగిందని, 56 మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎస్ఎల్‌బీసీ వద్ద పెట్రోల్ పంపు, ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్, రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. బస్టాండ్ విస్తరణలో భాగంగా కొత్త కౌంటర్లు, వెయిటింగ్ గార్డెన్, బాత్రూములు, టాయిలెట్లు, ఆధునిక ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ పనుల కోసం అదనంగా రూ.5 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్లు



చెప్పారు. పట్టణ అభివృద్ధికి రూ.83 కోట్ల రూపాయలతో తాగునీటి శుద్ధి (వాటర్ ఫిల్టర్) వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోపాటు, పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్ది మోడల్ సిటీగా రూపొందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కురిసిషా ఖాన్ ,మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక ఆర్థిక శాఖ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటిసి గుమ్మలమోహన్ రెడ్డి, కార్పొరేటర్ కవిత, రమేష్, లైజన్ ఆఫీసర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్యంలోనే ఏఐ పాఠాలు.. విద్యాశాఖ కొత్త కార్యాచరణ ఇదే..

(హైదరాబాద్)

రాష్ట్రంలోని పాఠశాల విద్యలో విద్యాశాఖ సంస్కరణల్లో భాగంగా మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులను బాల్యం నుంచే సిద్ధం చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. విద్యార్థులకు టెక్నాలజీని చేరువ చేస్తూ 3 నుంచి 5వ తరగతి పిల్లలకు వారానికి 80 నిమిషాల పాటు ఏఐ పాఠాలు చెప్పనున్నారు. మ్యాథ్స్, తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో పిల్లల సామర్థ్యాలను పెంచేందుకు ఏఐ టూల్స్ వాడనున్నారు.

గణితానికి 20 నిమిషాల చొప్పున వారానికి రెండు సార్లు, భాషా సబ్జెక్టులకు అంతే సమానంగా మొత్తం 80 నిమిషాల పాటు ఏఐ సాఫ్ట్ వేర్ తో పాఠాలు నేర్చుకుంటారు. ఇప్పటివరకు కేవలం ప్రభుత్వ పాఠశాలలకే పరిమితమైన ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) ప్రోగ్రాంను ఈ విద్యా సంవత్సరం 2026-27 నుంచి అన్ని ప్రైవేటు పాఠశాలల్లోనూ తప్పనిసరి చేస్తూ పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. తరగతులకు తగిన విధంగా అభ్యసన సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంతో 1 నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులందరికీ ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

**మెరుగుపడిన ర్యాంక్..** నాలుగేళ్లుగా చేపట్టిన ప్రణాళికలతో జాతీయ స్థాయి సర్వేల్లో తెలంగాణ ర్యాంకు 36 నుంచి 26 కు మెరుగుపడిందని, దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ విద్యా సంవత్సరం పకడ్బందీ ప్రణాళికలు రూపొందించారు. జాతీయ స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యా ప్రమాణాలను పెంచడం, ర్యాంకింగుల్లో మెరుగైన స్థానాన్ని సాధించడమే లక్ష్యంగా




ప్రభుత్వం అడుగులు వేస్తున్నది.

**మూడు రకాల పరీక్షలు..** పిల్లల్లో ప్రాథమిక స్థాయిలోనే చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. అలాగే మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు లెర్నింగ్ ఎన్ రిచ్ మెంట్ పీరియడ్ పేరుతో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఏడాదిలో మూడు సార్లు జులైలో బేస్ లైన్ టెస్ట్, నవంబర్ లో మిడ్ లైన్ పరీక్షలు, మార్చిలో ఎండ్ లైన్ పరీక్షలు నిర్వహించి వాటి వివరాలను స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ లో నమోదు చేయాల్సి ఉంటుంది. తరగతి గదిలో వెనుకబడిన పిల్లల కోసం టీచర్ సపోర్టు గ్రూపులను ఏర్పాటుచేసి అందరికీ కనీస సామర్థ్యాలు మెరుగుపడేలా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుంది.

## ఇసుక కాంట్రాక్టర్లకు గుడ్ న్యూస్.. రూ.50 కోట్లు విడుదల..



(హైదరాబాద్)

రాష్ట్రంలో ఇసుక కాంట్రాక్టర్ల బకాయిల చెల్లింపు కోసం ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసినట్లు తెలంగాణ ఖనిజా వృద్ధి సంస్థ ఎండీ వైస్‌చైర్మన్, ఎండీ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం ఇసుక ర్యాండమైజేషన్ బుకింగ్‌లు ఉదయం 9 గంటలతో పాటు సాయంత్రం 4 గంటలకు అమలు చేయనున్నట్లు, దీంతో మరింత పారదర్శకత, సమాన బుకింగ్ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. కార్పొరేషన్ రోజుకు 1.10 లక్షల మెట్రిక్‌టన్నులు ఇసుక అందుబాటులో ఉంచుతుందని అందులో 0.63 మెట్రిక్ టన్నులు బుక్ అవుతుండగా, 0.46 మెట్రిక్ టన్నులు బుక్ కాకుండా మిగులుతుందన్నారు. రాష్ట్రంలో ఇసుక కొరత అనేది ఎక్కడ లేదని కొందరు కావాలని సంస్థపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఇసుక 24 గంటలు అందుబాటులో ఉంటుందని, అవుట్ ఆఫ్ స్టాక్ అని చూపిస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. టీజీఎండీసీ వద్ద విక్రయానికి 1.15 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వేందుకు సిద్ధంగా ఉందని, ఇసుక బుకింగ్ వ్యవస్థ పూర్తిగా డిజిటల్, స్వయం చాలక వేదిక ద్వారా నిర్వహిస్తోందన్నారు. అన్ని బుకింగ్‌లు ముందు నిర్దేశించిన సిస్టమ్ ప్రోటోకాల్స్ ఆదారంగా సాండ్ సేల్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా ప్రాసెస్ చేయబడుతుందని వెల్లడించారు. ఆర్డర్ల కేటాయింపులో మానవుల జోక్యం ఉండదని, బుకింగ్ వ్యవస్థను పారదర్శకత, నిష్పకపాతత్వం, వినియోగదారులందరికి సమాన అవకాశాలు కల్పించే విధంగా రూపొందించ బడిందన్నారు.

మౌలిక వసతుల ప్రాజెక్టులు, పరిశ్రమలు, సంస్థలు ఇతర పెద్ద వినియోగదారుల అవసరాలు తీర్చేందుకు బల్క్‌బుకింగ్ సౌకర్యం ప్రవేశపెట్టామన్నారు. అర్హత ప్రమాణాలు, బుకింగ్ పరిమితులు, చెల్లింపు, కేటాయింపు విధానాలు అన్ని దరఖాస్తులకు సమానంగా వర్తిస్తాయని ఎటువంటి వివక్ష ఉండదన్నారు. బల్క్‌బుకింగ్ ఆమోదం పొందిన తరువాత కొంతమంది వినియోగదారులు ఒక రీచ్ నుంచి మరో రీచ్‌కు ఆర్డర్ బదిలీ చేయాలని కోరితే రుసుము, జరిమానాలు పైలట్ ప్రాతిపదికన విధించబడుతుందని చెప్పారు. ఈనెల 17వ తేదీ నుంచి ఇప్పటివరకు 83 ఆర్డర్లపై రూ.2.83 లక్షల వసూలు చేసినట్లు వివరించారు. ఈకార్యక్రమంలో అధికారులు ఎల్లయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## త్యాగానికి ప్రతీక మొహర్రం



(రామకిష్టయ్య సంగనభట్ల)

హిందువులు, ముస్లిం సోదరులూ సమిష్టిగా జరుపుకునే మొహర్రం ప్రత్యేకత సంతరించుకుంది. త్యాగానికి, మహోన్నత సనాతన సాంప్రదాయానికి, మత సామ రస్యానికి ప్రతీక మొహర్రం వేడుక. ధర్మసంస్థాపన లక్ష్యంగా, నమ్మిన సిద్ధాంతాల కోసం పలువురు ప్రాణాలర్పించిన మాసం మొహర్రం. ధర్మ సంస్థాపనార్థం హజ్రత్ ఇమామ్ హుస్సేన్, హసన్ లు తమ ప్రాణాలను అర్పించి 14 వందల సంవత్సరాలు గడిచినా అమరవీరుల త్యాగాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో స్మరిస్తూ, అమరుల త్యాగశీలతకు జోహార్లను అర్పించడం సత్సాంప్రదాయంగా ఆచరిస్తున్నారు. మొహర్రం మాసమంటే రక్తపు టేరులతో ఎర్రబారిన కర్బల మైదానం ముస్లిం సోదరుల కళ్లలో సజీవంగా సాక్షాత్కరిస్తుంది. ధర్మాధర్మాలకు జరిగిన సంఘర్షణ ఫలితమే కర్బల దుర్ఘటనగా ముస్లింలు భావిస్తారు. ఇస్లాం మత స్థాపకుడు ప్రవక్త మహమ్మద్ పరమపదించిన

అనంతరం సమ సమాజ స్థాపన కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో, సౌదీ అరేబియాలో తమ ప్రతినిధిని ఎన్నుకునే కార్యక్రమాన్ని చేపట్టారు. తదనుగుణంగా మదీనా రాజధానిగా గల రాజ్యానికి హజ్రత్ అబూబకర్ తొలి ఖలీఫాగా ఎన్నుకొనగా, అనంతరం హజ్రత్ ఉమర్, హజ్రత్ ఉస్మాన్ హజ్రత్ అలీలను ఖలీఫాగా ఎన్నుకున్నారు. వీరి పరిపాలన సమయంలో న్యాయం, ధర్మం నాలుగు పాదాలపై

నడిచాయని చెపుతారు. ధార్మిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో సమానత్వం వెల్లి విరిసిందంటారు. ఐదవ ఖలీఫాగా ప్రజలు ఇమాం హుస్సేన్ తమ ప్రతినిధిగా ఎన్నుకోగా, సిరియా ప్రాంతానికి గవర్నరుగా ఉన్న హజ్రత్ మివాయా అధికార దాహంతో ఖలీఫా పదవిని ఆశించి

పోటీపడగా, ఇరువర్గాల మధ్య యుద్ధానికి నాంది పలికింది. యుద్ధ పరిణా మాలను గ్రహించిన హుస్సేన్, రక్తపాత నివారణకై రణరంగం నుండి నిష్క్రమించి, ప్రజలు తమకు విశ్వాసంతో కట్టబెట్టిన అధికారాన్ని త్యాగం చేశారు. పదవీకాంక్షా లోలుడైన మివాయ తన కుమారునికి పట్టం కట్టాలని ప్రజలపై ఒత్తిడి తెచ్చిన స్థితిలో, ప్రాణభయంతో ప్రజలు మివాయ కొడుకు యజీద్ రాజుగా గుర్తిస్తారు. అయితే ఈ చర్యలు ప్రజాస్వామ్య వాదులకు మింగుడు పడలేదు. తత్ఫలితంగా ప్రజలు రాజుకు ఎదురు తిరిగి ఉద్యమిస్తారు. ఉద్యమ నాయకత్వ బాధ్యతలను హజ్రత్ హుస్సేన్ కి అప్పగిస్తారు. ఇస్లాం నిబంధనల ప్రకారం ఏసమస్య కైనా చర్చలు సంప్రదింపులే పరిష్కార మార్గాలు కావడం మూలంగా, హజ్రత్ హుస్సేన్ సిరియా రాజధాని కుఫాకు సంప్రదింపులకై బయలు దేరి వస్తుండగా, రాజు యజీద్ విషయాన్ని తెలుసుకుని హుస్సేన్ రాజధానికి వెళ్ళి చర్చలు జరిపితే తన అధికారానికి ముప్పు వాటిల్లక తప్పదని గ్రహించి, హుస్సేన్ ను అడ్డుకోవడానికి పెద్ద సైన్యాన్ని పంపుతాడు. మార్గ మధ్యలో కర్బల మైదానంలో యజీద్ సైన్యం ఎదురై హుస్సేన్ పరివారాన్ని అడ్డగిస్తారు. దీనితో ఇరువర్గాల మధ్య భీకర యుద్ధం జరుగుతుంది. హుస్సేన్ పరివారం శత్రు సైన్యాన్ని చీల్చి చెండాడినా, కొంతకాలం యుద్ధం జరిగాక చివరకు హుస్సేన్ ఒక్కడే మిగులగా, మొహర్రం మాసం లోని పదో తేదీ శుక్రవారం హిజ్రీ 60వ సంవత్సరం నాడు హుస్సేన్ హోరా హోరీగా పోరాడు తున్న సమయంలో, సూర్యుడు అస్తమించే సమయం కావడంతో, కొంత వ్యవధి కావాలని అనుమతి గైకొనగా, శత్రువులు అదే అదనుగా భావించి, నమాజ్లో భాగంగా సిజ్దా చేస్తుండగా బాణాలతో దారుణంగా హతమార్చి, తలను మొండెం నుంచి వేరు చేసి, చేతులు ఖండించి బాణాలకు, బరిసెలకు తగిలించుకుని నాట్య విన్యాసాలు చేశారు. అట్టిరోజును ఇస్లాం మతస్తులు త్యాగదినంగా పరిగణించి త్యాగ శీలతకు ప్రతీకగా పీర్ల దినాన్ని మొహర్రం పేరుతో జరుపు కుంటూ అమర వీరులను స్మరిస్తారు..

మొహర్రంను హిందూ, ముస్లింలు సమైక్యంగా జరుపు కోవడం ఆనాదిగా సంప్రదాయంగా వస్తోంది. తెలుగు ప్రాంతాల్లో, మరీ ముఖ్యంగా నిజాం పాలిత ప్రాంతాల్లో మొహర్రం పండుగను ముస్లిములే కాక అన్ని వర్గాల ప్రజలూ జరుపుకోవడం వందలాది ఏళ్ళుగా సాగుతోంది. యాత్రా చరిత్ర కారుడు ఏనుగుల వీరాస్వామయ్య జూన్ 29, 1830న నిజాం పాలిత ప్రాంతాల్లో ప్రారంభమైన మొహర్రం పండుగను తాను రచించిన కాశీయాత్ర చరిత్రలో అభివర్ణించారు. మొహర్రం నెల పదవ రోజు యౌమీ ఆషూరా. ముహమ్మద్ ప్రవక్త మనుమడైన హుసేన్ ఇబ్న్ అలీ, కర్బలా యుద్ధంలో అమరుడైన రోజు. ముహర్రం నెలను, "షహీద్ " (అమర వీరుల ) నెలగా వర్ణిస్తూ, పండుగలా కాకుండా, వర్ధంతిలా జరుపు కుంటారు. షియా ఇస్లాంలో ఈ ముహర్రం నెల, "ఆషూరా", కర్బలా యుద్ధంలో మరణించిన వారి జ్ఞాపకార్థం, శోక దినాలుగా గడుపుతారు.

షియాలు మాతమ్ (శోక ప్రకటన) జరుపుతారు. తెలంగాణలో పలుచోట్ల ఈ ముహర్రం పండుగను పీర్ల పండుగ అనే పేరుతో జరుపు కుంటారు. వారం రోజుల పాటు హిందూ, ముస్లిం సోదరులు కలిసి కట్టుగా పీర్లను పిల్లను నెలకొల్పి, చివరి రోజు వేలాదిమంది తోడురాగా వెళ్ళి పరి సమాప్తి గావిస్తారు. పీర్ల పండుగ సందర్భంగా సంతాన హీనులైన హిందూ స్త్రీలు మొక్కులు చెల్లించు కోవడం, పులుల ఇతర వేషాలతో విన్యాసాలు చేస్తూ, ఆడుతూ వారం డబ్బులు ప్రోగుచేసు కోవడం క్షేత్రం ఏటా అనుసరింప బడుతున్న సాంప్రదాయంగా మారింది. హైదరాబాద్ పాతబస్తీలో షియా ముస్లింలు తమను తాము హింసించు కుంటూ విషాదం వ్యక్తం చేస్తూ వూరేగింపులో పాల్గొంటారు. బీబీకా అలావా నుంచి ప్రారంభమై ఈ వూరేగింపు అలీజా కోట్ల, చార్మినార్, గుల్జార్ హౌస్, మీరాలం మండీ, దారుల్ షిఫాల మీదుగా కొనసాగి చాదర్ ఘాట్ వద్ద ముగుస్తుంది. శిక్షణ ఇచ్చిన ఏనుగుపై ఈ ఊరేగింపు సాగుతుంది.

## బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ వరంగల్ పర్యటనను విజయవంతం చేయాలి



ప్రత్యక్ష సాక్షి రంగశాయిపేట

బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ గారు ఈ నెల 29న వరంగల్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో రాష్ట్ర పార్టీ సూచనల మేరకు ఈరోజు వరంగల్ నగర కార్యాలయంలో వివిధ విభాగాలతో సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ అధ్యక్షుల పర్యటన ఏర్పాట్లు, సమన్వయ కమిటీల బాధ్యతలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు, రత్నం సతీష్ షా మరియు కందగట్ల సత్యనారాయణ, మంజుల రెడ్డి, బైరి మురళీకృష్ణ,జటోతు శ్రీనివాస్, త్రిలోక్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, రాణా ప్రతాప్ రెడ్డి, జిల్లా పదాధికారులు మరియు వివిధ విభాగాల బాధ్యులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట అనివార్యం

## జూన్ 26.. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం


ప్రపంచ వ్యాప్తంగా మానవ సమాజాన్ని పట్టిపీడిస్తున్న అతిపెద్ద సామాజిక, ఆరోగ్య, ఆర్థిక సమస్యలలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం ఒకటి. వ్యక్తిగత జీవితాలను ఛిన్నాభిన్నం చేయడమే కాకుండా కుటుంబ వ్యవస్థలను, సామాజిక సంబంధాలను, దేశాల ఆర్థిక వ్యవస్థలను సైతం దెబ్బతీస్తున్న ఈ దురాచారాన్ని అరికట్టేందుకు ప్రపంచ దేశాలు నిరంతరం పోరాడుతున్నాయి. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, వ్యాపారాన్ని నిరోధించాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం జూన్ 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1987 డిసెంబర్ 7న ఐక్యరాజ్యసమితి సాధారణ సభ ఆమోదించిన తీర్మానం 42/112 ప్రకారం ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ప్రపంచాన్ని మాదక ద్రవ్యాల ముప్పు నుండి రక్షించాలనే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి మాదక ద్రవ్యాలు మరియు నేరాల కార్యాలయం అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. మానవ చరిత్రలో మత్తు పదార్థాల వినియోగం కొత్తది కాదు. వేలాది సంవత్సరాలుగా కొన్ని మొక్కలు, పదార్థాలు ఔషధ అవసరాలకు, కొన్ని సాంప్రదాయ ఆచారాలకు ఉపయోగించబడుతున్నాయి. అయితే ఆధునిక కాలంలో వీటి వినియోగం వైద్య అవసరాలను దాటి వ్యసనంగా మారడం సమస్యకు మూల కారణమైంది. ముఖ్యంగా ఇరవయ్యో శతాబ్దం ద్వితీయార్థం నుండి హెరాయిన్, కొకైన్, ఎల్ఎస్డీ, సింథటిక్ డ్రగ్స్, మెథాంఫెటమైన్ వంటి రసాయనిక మాదక ద్రవ్యాల వ్యాప్తి ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేసింది. నేడు డ్రగ్స్ అక్రమ రవాణా అంతర్జాతీయ నేర ముఠాలకు కోట్లాది డాలర్ల ఆదాయ వనరుగా మారింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఏదో ఒక రూపంలో మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్నారు. యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ విడుదల చేసిన వరల్డ్ డ్రగ్ రిపోర్ట్ ప్రకారం ప్రపంచంలో సుమారు 29 కోట్ల మందికి పైగా మాదక ద్రవ్యాలను వినియోగించిన అనుభవం ఉంది. వీరిలో కోట్లాది మంది వ్యసన రుగ్మతలతో బాధపడుతున్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది మాదక ద్రవ్యాల కారణంగా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రాణాలు కోల్పోతున్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, హింసాత్మక సంఘటనలు, నేరాలు, ఆత్మహత్యలు ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలపై తీవ్ర భారాన్ని మోపుతున్నాయి.

భారతదేశంలో కూడా మాదక ద్రవ్యాల సమస్య క్రమంగా విస్తరిస్తోంది. ఒకప్పుడు సరిహద్దు ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన ఈ సమస్య ఇప్పుడు పట్టణాలు, చిన్న నగరాలు, గ్రామీణ ప్రాంతాలకు కూడా వ్యాపించింది. ముఖ్యంగా యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో ఇరవై నుంచి ఇరవై అయిదేళ్ల వయస్సులో వ్యసనాలకు గురయ్యే వారు ఇప్పుడు పదిహేను నుంచి పదిహేడేళ్ల వయస్సులోనే మాదక ద్రవ్యాల బారిన పడుతున్నట్లు అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, వృత్తి నిపుణులు కూడా ఈ వ్యసనానికి బలవుతున్నారు.

మాదక ద్రవ్యాలు మనిషి మెదడు పనితీరుపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. మెదడులో డోపమైన్, ఎండార్ఫిన్స్ వంటి రసాయనాల విడుదలను అసహజంగా పెంచడం ద్వారా తాత్కాలిక ఆనందాన్ని కలిగిస్తాయి. అయితే కొంతకాలం తర్వాత సహజసిద్ధమైన ఆనందాన్ని పొందే సామర్థ్యం తగ్గిపోతుంది. ఫలితంగా అదే మత్తును పొందేందుకు మరింత ఎక్కువ మోతాదులో మాదక ద్రవ్యాలను వినియోగించాల్సి వస్తుంది. ఈ పరిస్థితి వ్యసనానికి దారితీస్తుంది. ఒకసారి బానిసగా మారిన తర్వాత మాదక ద్రవ్యాలు లభించని సందర్భంలో తీవ్ర ఆందోళన, చిరాకు, నిరాశ, నిద్రలేమి, శారీరక బలహీనత, మానసిక అస్థిరత వంటి లక్షణాలు కనిపిస్తాయి.

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు కేవలం వ్యక్తికే పరిమితం కావు. కుటుంబాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయి. వ్యసనానికి బానిసైన వ్యక్తులు కుటుంబ సభ్యులతో ఘర్షణలకు




దిగడం, ఆర్థిక వనరులను వృథా చేయడం, కుటుంబ బంధాలను దెబ్బతీయడం సాధారణంగా కనిపించే అంశాలు. అనేక కుటుంబాలు అప్పులపాలవడం, విడాకులు, కుటుంబ విచ్ఛిన్నాలు, గృహ హింస వంటి సమస్యలకు గురవుతున్నాయి. సమాజంలో నేరాల పెరుగుదలకు కూడా మాదక ద్రవ్యాలు ప్రధాన కారణాలలో ఒకటిగా నిలుస్తున్నాయి. యువతలో మాదక ద్రవ్యాల వినియోగానికి అనేక కారణాలు ఉన్నాయి. స్నేహితుల ప్రభావం, కొత్త అనుభవాల పట్ల కుతూహలం, చదువుల ఒత్తిడి, ఉద్యోగ పోటీ, కుటుంబ కలహాలు, మానసిక ఆందోళనలు, నిరుద్యోగం, సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి అంశాలు యువతను ఈ దురలవాట్ల వైపు నెడుతున్నాయి. కొందరు తమ సమస్యలను మరచిపోవడానికి, మరికొందరు ఫ్యాషన్‌గా భావించి, ఇంకొందరు సాహసంగా భావించి మాదక ద్రవ్యాలను ఆశ్రయిస్తున్నారు. కానీ తాత్కాలిక ఆనందం కోసం ప్రారంభమైన అలవాటు జీవితాంతం వెంటాడే శాపంగా మారుతోంది.

భారతదేశంలో గంజాయి, చరస్, హెరాయిన్, బ్రౌన్ షుగర్, కొకైన్, మార్ఫిన్, మెథాంఫెటమైన్, ఎల్ఎస్డీ వంటి మాదక ద్రవ్యాలు వివిధ రూపాల్లో చలామణిలో ఉన్నాయి. ఇటీవల సింథటిక్ డ్రగ్స్ వినియోగం పెరుగుతుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ డ్రగ్ ముఠాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కొత్త మార్గాల్లో అక్రమ రవాణా నిర్వహిస్తున్నాయి. సరిహద్దులు, సముద్ర మార్గాలు, ఆన్‌లైన్ వేదికలు కూడా డ్రగ్స్ వ్యాపారానికి వినియోగించబడుతున్నాయి.

ఈ సమస్యను ఎదుర్కొనేందుకు భారత ప్రభుత్వం నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టాన్ని అమలు చేస్తోంది. ఈ చట్టం ప్రకారం మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, నిల్వ, వినియోగం వంటి చర్యలు కఠిన శిక్షార్హమైన నేరాలు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, పోలీసు శాఖలు, కస్టమ్స్ విభాగాలు, ఇతర దర్యాప్తు సంస్థల ద్వారా అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. అయినప్పటికీ సమస్య పూర్తిగా అదుపులోకి రావడం లేదు.

మాదక ద్రవ్యాల నిర్మూలనలో చట్టాల కంటే అవగాహన మరింత కీలకం. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు మాదక ద్రవ్యాల ప్రమాదాలపై నిరంతర అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించాలి. సమాజంలోని ప్రతి వర్గం ఈ సమస్యను కేవలం వ్యక్తిగత సమస్యగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలి. ముఖ్యంగా వ్యసనానికి గురైన వారిని నేరస్థులుగా కాకుండా బాధితులుగా పరిగణించి వారికి వైద్య చికిత్స, మానసిక సలహా, పునరావాస సేవలు అందించాలి.

జూన్ 26 అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు; సమాజాన్ని అప్రమత్తం చేసే హెచ్చరిక కూడా. మాదక ద్రవ్యాలు ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయి, కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తాయి, యువత భవిష్యత్తును చీకటిలోకి నెడతాయి, దేశ ప్రగతికి అడ్డంకిగా మారతాయి. అందువల్ల ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, కుటుంబాలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా, పౌర సమాజం సమన్వయంతో పనిచేసి మాదక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేయాలి. వ్యసన రహిత యువత, ఆరోగ్యవంతమైన కుటుంబాలు, సురక్షిత సమాజం, సుసంపన్న దేశం అనే లక్ష్యాన్ని సాధించాలంటే మాదక ద్రవ్యాలపై పోరాటాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాల్సిన అవసరం ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్, 9440595494**


# ఎమ్మెల్యే మాటకు కట్టుబడి ఉండాలి

## అచ్చంపేటలో బిజెపికి స్థానమే లేదు.. రాబోయేది కెసిఆర్ పాలన

## హరీష్ రావు పర్యటనతో పార్టీలో మరింత జోష్

**ప్రత్యక్ష సాక్షి, అచ్చంపేట**

ప్రజా పాలన పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేయకుండా రైతులను సామాన్య ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇక నూకలు చెల్లాయని అచ్చంపేట మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఎడ్ల నరసింహా గౌడ్ అన్నారు. రెండున్నర ఏండ్ల పాలనలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు పరచడంలో విఫలం చెందారన్నారు. గత మూడు రోజుల క్రితం అచ్చంపేటకు ట్రిబుల్ షూటర్ మాజీ మంత్రి హరీష్ రావు పర్యటన సందర్భంగా పార్టీలో మరింత జోష్ పెరిగిందని.. పార్టీ క్యాడరు స్థిరంగానే ఉందని, పార్టీ బలాన్ని చూసి అధికార పార్టీతో పాటు బిజెపి పార్టీకి చెమటలు పడుతున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు గెలవడం ఖాయమని హరీష్ రావు ప్రకటించడంతో అందుకు స్పందించిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాలమూరు గడ్డపై బిఆర్ఎస్ పార్టీకి రెండు సీట్లు వచ్చిన అంటే కాంగ్రెస్ పార్టీకి 12 సీట్లు వచ్చినా కూడా రాజీనామా చేస్తామని ప్రకటించిన దానికి ఎమ్మెల్యే కట్టుబడి ఉండాలన్నారు. అలాగే బిజెపి పార్టీకి నల్లమల్లలో అచ్చంపేట ప్రాంతంలో ఆదరణలేదని మొత్తంగా దక్షిణ తెలంగాణలో బిజెపి పార్టీ కేవలం మనుగడ కొనసాగించడమేనన్నారు. నల్లమల్ల గడ్డపై కాషాయపు జెండా ఎగరడం అనేది ఒక కలలాంటిదని ఎప్పుడైనా మూడో స్థానంలోనే ఉంటుందన్నారు. మాజీ ఎమ్మెల్యే పార్టీలో ఉన్నప్పుడు.. కనిపించని వివక్ష నేడు విమర్శలు చేయడం తగదన్నారు. ఏది ఏమైనా అచ్చంపేటలో బిఆర్ఎస్ పార్టీ తిరిగి పుంజుకోవడంతోపాటు రాబోయే ఎన్నికల్లో అచ్చంపేట గడ్డపై టిఆర్ఎస్ జెండా ఎగరడం కాయమేనన్నారు. ఇటీవల ఒక సర్వే సంస్థ చేపట్టిన క్షేత్రస్థాయి సర్వేలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే



బిఆర్ఎస్ 47%, అధికార పార్టీకి 42% బిజెపి పార్టీకి ఒకటి కేవలం రెండు శాతం మాత్రమే ఆదరణ ఉందని ఆ సర్వే సంస్థ పేర్కొన్నదన్నారు. ముమ్మాటికి మళ్లీ అధికారంలోకి రావడం కేసీఆర్ సీఎం కావడం ఎవరు కాదనలేని సత్యమన్నారు.

# తీన్మార్ మల్లన్న సభను జయప్రదం చేయాలి

## టిఆర్పీ జిల్లా అధ్యక్షులు రవి పటేల్



**మల్హర్, ప్రత్యక్ష సాక్షి**

జూలై 5న భువనగిరిలో తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో జరగనున్న "రాజ్యాధికార సమరభేరి" సభను విజయవంతం చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్పీ) భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ పిలుపునిచ్చారు. గురువారం తాడిచర్ల గ్రామంలో పర్యటించిన ఆయన.. బీసీ సంఘాల నాయకులు విజయగిరి సమ్మయ్య, జక్కం రాజేందర్, ఆకుల నర్సింగంలకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యమన్నారు. ఈ సభకు మల్హర్‌రావు మండలం నుండి భారీగా తరలివస్తామని బీసీ నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ మేనం సంతోష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం






**(ప్రత్యక్ష సాక్షి, కరీంనగర్)**

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని (జూన్ 26) పురస్కరించుకుని, తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్' కార్యక్రమాలు కరీంనగర్ జిల్లాలో ఉత్సాహంగా సాగుతున్నాయి. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు ఇతర ప్రభుత్వ విభాగాల సమన్వయంతో నగరంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కలెక్టరేట్ ప్రారంభమైన ఈ 2 కిలోమీటర్ల ర్యాలీ గీతాభవన్ చౌరస్తా మీదుగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, నర్సింగ్, మెడికల్ కాలేజీల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గీతాభవన్ చౌరస్తాలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన వీధి నాటకం (నాటిక), అవగాహన గీతాలు ప్రజలను, తోటి విద్యార్థులను ఎంతగానో ఆలోచింపజేశాయి.

అంధకారంలోకి భవిష్యత్తు -- స్కిట్ ద్వారా కళ్ళకు కట్టినట్లు ప్రదర్శన: ర్యాలీ అనంతరం కమిషనరేట్ కేంద్రంలోని 'అస్త్ర కన్వెన్షన్ హాలు' నందు పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం అధ్యక్షతన విద్యార్థులతో భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ విడుదల చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రత్యేక షార్ట్ ఫిల్మ్‌ను విద్యార్థులకు ప్రదర్శించారు. అనంతరం చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్ డ్రగ్స్ మహమ్మారి వల్ల యువత జీవితాలు ఎలా అంధకారంలోకి వెళ్తాయి, కుటుంబాలు ఎలా నాశనమవుతాయనే విషయాన్ని కళ్ళకు కట్టింది. నర్సింగ్ విద్యార్థినులు తమ నృత్య ప్రదర్శన ద్వారా డ్రగ్స్ రహిత సమాజంపై చక్కని సందేశాన్ని ఇచ్చారు.

ఒత్తిడిని అధిగమించడానికి క్రీడలపై దృష్టి పెట్టండి: సిపి గౌష్ ఆలం సదస్సులో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ.. సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద మహమ్మారి మాదకద్రవ్యాల దుర్వినియోగం (డ్రగ్ అబ్యూస్) అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువత ఎలాంటి చెడు వ్యసనాలకు లోనుకాకూడదని హితవు పలికారు. చదువుల వల్ల కలిగే ఒత్తిడిని అధిగమించేందుకు డ్రగ్స్ వైపు కాకుండా, స్పోర్ట్స్, శారీరక వ్యాయామం (ఫిజికల్ యాక్టివిటీ) పై దృష్టి సారించాలని సూచించారు.

కరీంనగర్ జిల్లాను డ్రగ్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఇటీవల విద్యాసంస్థల పరిసరాల్లోని (100 మీటర్ల లోపు) 99 పాన్ షాపులపై దాడులు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 52 కేసులు నమోదు చేసినట్లు గుర్తుచేశారు. కమీషనరేట్ పరిధిలోని అన్ని విద్యాసంస్థల్లో 'కాన్షియస్ క్లబ్స్' ఏర్పాటు చేశామని తెలిపారు. "SAY NO TO DRUGS - SAY YES TO LIFE" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ లేదా గంజాయి సేవించడం, విక్రయించడం 'ఎన్.డి.పి.ఎస్ (చీణూూ) యాక్ట్ – సెక్షన్ 27' ప్రకారం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, దీనివల్ల భవిష్యత్తు సర్వనాశనమవుతుందని హెచ్చరించారు.

స్వీయ నియంత్రణే శ్రీరామరక్ష: సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను, దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పోలీస్ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలు ఎంతో కృషి చేస్తున్నాయని కొనియాడారు. అయితే, అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, యువతలో 'స్వీయ నియంత్రణ' ఉన్నప్పుడే డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండి, తమ జీవిత లక్ష్యాలను చేరుకోగలరని ఆకాంక్షించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం -- ప్రతిజ్ఞ, సంతకాల సేకరణ: ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ వీక్ లో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు సిపి గౌష్ ఆలం చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం అధికారులు, విద్యార్థులందరూ కలిసి డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. హాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'సంతకాల సేకరణ బోర్డు'పై సీపీతో పాటు ఇతర అతిథులు, అధికారులు సంతకాలు చేసి, కరీంనగర్‌ను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దుతామని సంకల్పించారు. ఈ సదస్సులో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి (ఐబొ) సరస్వతి, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఐజూూ) పర్వీన్, ఏసీపీలు వేణుగోపాల్, విజయకుమార్, యాదగిరిస్వామి, ఆంటీ నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్ ఇతర పోలీస్, ఎక్సైజ్ అధికారులు మరియు వివిధ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డ్రగ్స్ రహిత సమాజమే ధ్యేయం

## కొయ్యూరు ఎస్ఐ పి. మహేందర్ కుమార్

**మల్హర్, ప్రత్యక్ష సాక్షి**

మాదకద్రవ్యాలు లేని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే మన అందరి లక్ష్యం కావాలి" అని కొయ్యూరు ఎస్ఐ పి. మహేందర్ కుమార్ పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ ప్రత్యేక ఆదేశాల మేరకు.. గురువారం ఉదయం కొయ్యూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 'ఓపెన్ హౌస్' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, నేటి యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారి వల్ల కలిగే భయంకరమైన శారీరక, మానసిక దుష్ప్రభావాలను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. చట్టవ్యతిరేకమైన మాదకద్రవ్యాలను సమాజం నుండి పూర్తిగా తరిమికొట్టేందుకు ప్రజలు, విద్యార్థులు పోలీసులకు ఎల్లప్పుడూ సమాచారం ఇస్తూ సహకరించాలన్నారు. డ్రగ్స్ నిర్మూలన అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ




ఇందులో భాగస్వాములు కావాలని ఎస్ఐ మహేందర్ కుమార్ ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాలల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ కాయల గురించి మీకు తెలుసా..?

## ఎక్కడ కనిపించినా విడిచిపెట్టకుండా తెచ్చి తినండి.. ఎందుకంటే..?



# ఈ పండ్లను మీరు ఎప్పుడైనా తిన్నారా..?

## వీటి లాబాలు తెలిస్తే అస్సలు విడిచిపెట్టరు..!

స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, క్రాన్ బెర్రీ.. ఇలా అనేక రకాల బెర్రీ పండ్ల గురించి మీరు వినే ఉంటారు. ఆయా పండ్లను చూసి కూడా ఉంటారు. కానీ మల్బెర్రీ పండ్లను మీరు ఎప్పుడైనా చూశారా..? ఈ పేరును చాలా మంది వినే ఉంటారు. కానీ ఈ పండ్లను చూసి ఉండరు. మనకు రహదారుల పక్కన లేదా స్టోర్స్‌లో మల్బెర్రీ పండ్లను బాక్సుల్లో పెట్టి విక్రయిస్తుంటారు. ఇవి ఎంతో తియ్యగా ఉంటాయి. చూసేందుకు ఆకర్షణీయంగా కూడా ఉంటాయి. అనేక పోషకాలను కలిగి ఉంటాయి. మల్బెర్రీ పండ్లు సాధారణంగా తెలుపు, ఎరుపు, బ్లాక్ రంగుల్లో ఉంటాయి. అయితే ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మల్‌బెర్రీ పండ్లలో ఆంథో సయనిన్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి.

రోగాలు రాకుండా రక్షణ..: రెస్వెరెట్రాల్, ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ యాసిడ్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఈ బెర్రీ పండ్లలో అధికంగానే ఉంటాయి. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. గుండె జబ్బులు, క్యాన్సర్, నాడీ సంబంధ వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. మల్బెర్రీ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాల నుంచి మనల్ని సురక్షితంగా ఉంచుతుంది. మల్బెర్రీ పండ్లలో ఉండే రెస్వెరెట్రాల్ అనే సమ్మేళనం శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఇదే పోషక పదార్థం రెడ్ వైన్‌లోనూ ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. గుండె కండరాలు వాపులకు గురి కాకుండా చూస్తుంది. రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ లెవల్స్ అదుపులో ఉంటాయి.

కంటి చూపు సమస్యకు..: మల్బెర్రీ పండ్లను తినడం వల్ల ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది పేగుల్లో మలం కదలికలను సులభతరం చేస్తుంది. దీంతో మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మల్బెర్రీ పండ్లలో 1-డిఆక్సీనోజిరిమైసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కార్బొహైడ్రేట్లను శరీరం త్వరగా గ్లూకోజ్‌గా మార్చకుండా చూస్తుంది. దీంతో షుగర్ లెవల్స్ పెరగవు, నియంత్రణలో ఉంటాయి. అందువల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. షుగర్ ఉన్నవారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. మల్బెర్రీ పండ్లలో జియాజంతిన్, లుటీన్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. కళ్లు ఆక్సీకరణ ఒత్తిడికి గురి కాకుండా చూస్తాయి. దీంతో వయస్సు మీద పడడం వల్ల వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే ఈ పండ్లలో ఉండే విటమిన్ ఎ కంటి చూపును మెరుగు పరుస్తుంది.

క్యాన్సర్ రాకుండా..: మల్బెర్రీ పండ్లలో బయో యాక్టివ్ సమ్మేళనాలు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్‌ఫ్లామేటరీ లక్షణాలను కూడా కలిగి ఉంటాయి. దీని వల్ల శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. మల్బెర్రీ పండ్లలో ఉండే ఆంథో సయనిన్స్, రెస్వెరెట్రాల్ అనే సమ్మేళనాల్ల క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకోవచ్చు. పలు రకాల క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. మల్బెర్రీ పండ్లలో విటమిన్ కె, క్యాల్షియం, ఐరన్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగామార్చి ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ పండ్లన తినడం వల్ల ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది రక్తం తయారయ్యేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. ఇలా మల్బెర్రీ పండ్లను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# సెగగడ్డలు బాధిస్తున్నాయా..



ఈ కాలంలో శరీరంలో అధిక వేడి కారణంగా ఎక్కడపడితే అక్కడ సెగగడ్డలు వస్తుంటాయి. అవి వచ్చినప్పుడు తీవ్రమైన నొప్పి, బాధ ఉంటుంది. చాలా మంది ఈ బాధను తట్టుకోలేరు. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ కారణంగా వచ్చే వీటి నుండి ఉపశమనం పొందాలంటే ఇంట్లోనే కొన్ని చిట్కాలు పాటించాలి.

సెగగడ్డలు రాకుండా ఉండాలంటే యాంటీ ఆక్సిడెంట్లు ఉండే పండ్లను రోజు వారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇలా చేయటం వల్ల బాక్టీరియా తగ్గుతుంది. రోజుకు 3 లీటర్ల మంచి నీరు తప్పనిసరిగా తాగాలి. కొబ్బరి నీళ్ళ, జ్యూసులు, కూరగాయల రసాలను సేవించటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇలా చేయటం వల్ల శరీరంలోని టాక్సిన్లు బయటకు వెళ్ళి పోతాయి. రక్తం శుద్ధి జరుగుతుంది. తద్వారా సెగగడ్డలు రాకుండా చూసుకోవచ్చు.

తొక్క తీసిన నాలుగు వెల్లుల్లి రెబ్బలు, అరస్పూన్ వాము కలిపి మెత్తని పేస్ట్‌గా చేయాలి. ఈ పేస్ట్‌ని సెగగడ్డలు ఉన్న ప్రదేశంలో రాసి పది నిమిషాలు అయ్యాక చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి.

ఒక గిన్నెలో రెండు స్పూన్ల బియ్యంపిండి వేసి దానిలో నీటిని కలిపి పొయ్యి మీద పెట్టి ఉడికించాలి. ఈ మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడే సెగ గడ్డలపై రాయాలి. పూర్తిగా ఆరనివ్వాలి అనంతరం చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి.

కలబంద జెల్‌లో కొద్దిగా పసుపు కలిపి. గడ్డలపై అప్లై చేయాలి. ఆరిన తర్వాత చల్లని వాటర్‌తో శుభ్ర పరుచుకోవాలి. ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

# ఈ కాయల గురించి మీకు తెలుసా..?

## ఎక్కడ కనిపించినా విడిచిపెట్టకుండా తెచ్చి తినండి.. ఎందుకంటే..?



టొమాటోలను మనం రోజూ వంటల్లో వేస్తూనే ఉంటాం. ఏ కూర అయినా సరే టొమాటోలు లేనిదే పూర్తి కాదు. టొమాటోలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతుంటారు. అయితే టొమాటోల్లోనూ అనేక రకాలు ఉన్నాయి. వాటిల్లో రామ ములక్కాయలు కూడా ఒకటి. ఇవి టొమాటోల మాదిరిగానే ఉంటాయి. కానీ పరిమాణంలో చాలా చిన్నగా ఉంటాయి. ఇవి కూడా టొమాటోల జాతికి చెందినవే. రామ ములక్కాయలు మనకు గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా లభిస్తుంది. సూపర్ మార్కెట్లు లేదా రైతు బజార్‌లలోనూ కొన్ని చోట్ల ఈ కాయలను విక్రయిస్తుంటారు. అయితే టొమాటోలలాగే రామ ములక్కాయలు కూడా మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వీటిని కచ్చితంగా ఆహారంలో భాగం చేసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

కళ్ల ఆరోగ్యానికి..: రామ ములక్కాయలను తినడం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ముఖ్యంగా ఈ కాయల్లో లైకోపీన్ అధికంగా ఉంటుంది. అందువల్లే ఈ కాయలు ఎరుపు రంగులో ఉంటాయి. లైకోపీన్ చాలా శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్. ఇది ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. దీంతో క్యాన్సర్, గుండె జబ్బులు, డయాబెటిస్ వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు. ఈ కాయల్లో ఉండే బీటా కెరోటీన్ మన శరీరంలో విటమిన్ ఎ గా మార్పు చెందుతుంది. లుటీన్ అనే మరో యాంటీ ఆక్సిడెంట్ కూడా ఈ కాయల్లో అధికంగానే ఉంటుంది. విటమిన్ ఎ, లుటీన్ కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కంటి చూపును మెరుగు పరుస్తాయి. రామ ములక్కాయల్లో ఉండే నారింజైన్, నారింజెనిన్ అనే సమ్మేళనాలు యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా పనిచేస్తాయి. ఇవి కళ్ల వాపులను తగ్గిస్తాయి.

గుండె ఆరోగ్యానికి..: రామ ములక్కాయల్లో ఉండే లైకోపీన్‌ను అధిక మొత్తంలో పొందాలంటే ఈ కాయలను ఎల్లప్పుడూ ఉడకబెట్టి మాత్రమే తినాలి. పచ్చి వాటికన్నా ఉడకబెట్టిన కాయల్లోనే మనకు లైకోపీన్ అధిక మొత్తంలో లభిస్తుంది. లైకోపీన్ వల్ల గుండె కండరాల వాపులు రాకుండా అడ్డుకోవచ్చు. రక్త నాళాల్లో బ్లడ్ క్లాట్స్ ఏర్పడకుండా నివారించవచ్చు. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

ఈ కాయల్లో ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. రామ ములక్కాయల్లో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్ కొవ్వు మెటబాలిజంను పెంచుతుంది. దీంతో శరీరంలో పేరుకుపోయిన మొండి కొవ్వు సైతం కరిగిపోతుంది. ఫలితంగా అధిక బరువు సులభంగా తగ్గుతారు.

ఎముకల ఆరోగ్యానికి..: రామ ములక్కాయల్లో ఉండే లైకోపీన్ క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటుందని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. ముఖ్యంగా ప్రోస్టేట్, బ్రెస్ట్ క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. లైకోపీన్ వల్ల మహిళల్లో ఎముకలు ఆరోగ్యంగా, దృఢంగా మారుతాయి. వృద్ధాప్యంలో వచ్చే ఆస్టియో పోరోసిస్ రాకుండా అడ్డుకోవచ్చు. ఈ కాయల్లో ఉండే క్యాల్షియం, విటమిన్ కె ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. విరిగిన ఎముకలు అతుక్కుంటున్న వారు ఈ కాయలను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. చర్మం లేదా జుట్టు సమస్యలు ఉన్నవారు ఈ కాయలను మెత్తని పేస్ట్‌లా చేసి ఫేస్ ప్యాక్ లేదా హెయిర్ ప్యాక్‌లా కూడా ఉపయోగించవచ్చు. ఫేస్ ప్యాక్ చేసుకుంటే అందులో కాస్త తేనె కలపాలి. అదే జుట్టుకు వాడితే ఆ పేస్ట్‌లో కాస్త పెరుగు కలిపి వాడాలి. దీంతో చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. చుండ్రు, జుట్టు రాలడం తగ్గుతాయి. ఇలా రామ ములక్కాయలతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# ఈ అలవాటును తప్పించండి..

చిన్నపిల్లల్లో చాలామందికి బొటనవేలు చప్పరించే అలవాటు ఉంటుంది. అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుంచి కొందరు పెద్ద పిల్లల వరకు ఈ అలవాటు ఉంటుంది. అయితే ఈ అలవాటును లైట్ తీసుకుంటే లేనిపోని సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ అలవాటు వల్ల పిల్లలకు ఆరోగ్య పరంగా చాలా సమస్యలు వస్తాయి. పిల్లలు సాధారణంగా ఈ అలవాటును రెండు ఏళ్ల వయసులో మానేస్తారు. కానీ, ఈ వయసు దాటిన తర్వాత కూడా బొటనవేలు చప్పరించే అలవాటు మానకపోతే కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

బొటనవేలు పీల్చడం వల్ల ముందు దంతాలు ముందుకు పొడుచుకుని రావడం, దవడ నిర్మాణం తప్పు దోవ పడుతుంది. దీని ఫలితంగా భవిష్యత్తులో ఆర్థోడాంటిక్ చికిత్స అవసరం అవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా నోటి చుట్టూ ఉన్న చర్మం నిరంతరం తడిగా ఉండటం వల్ల చర్మం పొడిబారడం, పగుళ్లు రావడం వంటి సమస్యలు ఏర్పడతాయి. పిల్లల నాలుక, నోటి కండరాల అభివృద్ధికి ఇది అడ్డుగా నిలిచే ప్రమాదం ఉంటుంది. ఫలితంగా పదాలను సరిగా పలకలేకపోవడం, మాట్లాడటంలో ఇబ్బంది పడటం వంటి సమస్యలు ఎదురవుతాయి. చిన్న పిల్లల చేతులు చాలా మురికిగా ఉంటాయి. ఇలాంటి సమయంలో పిల్లలు వేళ్లు నోట్లో పెట్టుకున్నప్పుడు చేతులపై ఉండే బ్యాక్టీరియా లేదా క్రిములు నోట్లోకి ప్రవేశిస్తాయి. దీని కారణంగా బిడ్డకు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు లేదా ఇతర జీర్ణ సమస్యలు రావచ్చు. ఇది మాత్రమే కాదు, తరచుగా నోటి పూతలు లేదా గొంతు నొప్పి కూడా ఈ అలవాటు ఫలితంగా రావచ్చు.

పిల్లలు ఈ బొటనవేలు నోట్లో పెట్టుకోవడం వల్ల బలహీనపడటంతో పాటు.. దీర్ఘకాలంగా ఈ అలవాటు కొనసాగితే చర్మంపై చిన్న గాయాలు ఏర్పడి ఇన్ఫెక్షన్ కూడా వచ్చే ప్రమాదం ఉంటుంది. అయితే దీన్ని నియంత్రించడానికి పిల్లలను గట్టిగా బెదిరించడం తగదు. ప్రేమగా వారి అలవాటును మాన్పించేందుకు ప్రయత్నించాలి. దగ్గర కూర్చోబెట్టుకుని ఈ అలవాటు వల్ల వచ్చే సమస్యలు వివరించాలి. బొమ్మలు, పుస్తకాలతో దృష్టి మళ్లించాలి. చేదు రసాయనాలను వాడటం, చేతి తొడుగులు తొడిగించడం కూడా ఒక మార్గం.



వేపాకు రసం బొటనవేలుకు ఒక పొరలా రాయాలి. దీంతో చేదు కారణంగా ఈ అలవాటును త్వరగా మానేస్తారు. ఈ అలవాటు మానేస్తే ఏదో ఒక గిఫ్ట్ లేదా ఆటబొమ్మ కొనిపెడతాం అని ఆశ చూపించినా ఫలితం ఉండొచ్చు.

కొంత మంది పిల్లలు కొన్ని సమయాల్లో మాత్రమే వేళ్లు చప్పరిస్తారు. నిద్రపోయే ముందు, ఏదైనా ఒత్తిడి, టెన్షన్‌లో ఉన్నప్పుడు ఇలా చేస్తుంటారు. ఆ సమయాన్ని గమనించి.. వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తే మంచి ఫలితాలుంటాయని నిపుణులు అంటున్నారు. బిడ్డ ఆరోగ్య భద్రత కోసం ఈ అలవాటు తీవ్రమయ్యే లోపు చర్యలు తీసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. ప్రేమతో, సహనంతో తీసుకున్న నిర్ణయాలు వారికి ఆరోగ్యంగా ఎదగడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు.


# దోమలను ఇలా తరిమేయండి..



ప్రస్తుతం వరుసగా కురుస్తున్న వర్షాలకు దోమల బెడద ఎక్కువవుతోంది. తరచూ దోమలు కుడితే అనేక ఆరోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తుంది. దీంతో చాలా మంది దోమల నివారణ కోసం రకరకాల మస్కిటో రిపెల్లెంట్లు, కాయిల్స్ వంటివి వాడుతుంటారు. ఇలాంటి కెమికల్ ఆధారిత నివారణలతో లేనిపోని అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకున్నట్టే. కొన్ని సింపుల్ టిప్స్ ఫాలో అయితే ఈ దోమల బెడద నుంచి సులభంగా తప్పించుకోవచ్చు. ఇలాంటి సహజ సిద్ధ చిట్కాలు పాటించటం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవని నిపుణులు చెబుతున్నారు.

దోమల నివారణ కోసం ఉపయోగించే మస్కిటో రిపెల్లెంట్‌లను శరీరానికి డైరెక్ట్‌గా అప్లై చేసుకోకూడదు. కొనే ముందు బాగా రీసెర్చ్ చేయాలి. ఉదయం- సాయంత్రం వేళ లాంగ్ స్లీవ్స్, షర్టులు, ప్యాంటులు, సాక్స్‌లు వేసుకోవటం ఉత్తమం. అలాగే, మస్కిటో నెట్‌లు కొనుక్కుని బెడ్ రూమ్‌లో పెట్టుకోవాలి. సిట్రోనెల్ల, లావెండర్, మారిగోల్డ్ వంటి మస్కిటో రెపెల్లెంట్ మొక్కలను ఇంట్లో ఏర్పాటు చేసుకోవటం వల్ల కూడా ఫలితం వుంటుంది. దాంతో పాటుగా ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీటి మడుగు, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలి. దోమల బెడద ఎక్కువగా ఉన్న చోట ఫ్యాన్లు పెట్టుకోవాలి. దోమలు కొన్ని రకాల సువాసనలకు దూరంగా వెళ్లిపోతుంటాయి. అలాంటి వాటిల్లో తులసి, వెల్లుల్లి, వేప నూనె, లవంగాలు, నిమ్మకాయ, ఉల్లిపాయ, ఆపిల్ సిడార్ వెనిగర్, యూకలిప్టస్ ఆయిల్, లావెండర్, పుదీనా వంటి సువాసనలకు దూరంగా పారిపోతాయి. దోమలు, ఈగలు ఎక్కువగా ఉండే మూలల్లో తరిగిన ఉల్లిపాయలను ఉంచటం వల్ల ఆ ఘాటైన వాసనకు దోమలు, ఈగలు ఆ దరిదాపుల్లో కనిపించవు.

# చేతులు కడుగుదాం ఇలా



చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఎన్నో ఇన్ఫెక్షన్లు, రోగాలు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చు. అయితే, దీని ప్రయోజనం అలా ఉంచితే చేతుల పరిశుభ్రత గురించి ఎన్నో అపోహలు ఉంటాయి. వాటిని నివృత్తి చేసుకుందాం.

గ్లవ్స్ తొడుక్కుంటే: ఎక్కువసేపు గ్లవ్స్ తొడుక్కోవడం వల్ల సురక్షితంగా ఉంటామని చాలామంది భ్రమలో ఉంటారు. నిజానికి గ్లవ్స్ తొడుక్కొని వస్తువులు ఇతరులకు ఇవ్వడం వల్ల ఒకరి నుంచి మరొకరికి ఇన్ఫెక్షన్ల ముప్పు ఎక్కువ. వండుతున్నప్పుడు, ఏవైనా వస్తువులు పట్టుకొన్నప్పుడు గ్లవ్స్ వాడుతుంటారు. అయితే, గ్లవ్స్ విడిచిపెట్టిన తర్వాత కూడా చేతులు శుభ్రం చేసుకోవాల్సిందే. అంతేకాదు గ్లవ్స్‌లో కూడా దుమ్ము, బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంది. ఇవి ఇతరులకు వ్యాపించవచ్చు. కాబట్టి, గ్లవ్స్ ధరించడం కంటే సబ్బుతో చేతులు కడుక్కోవడం మంచిది.

వేడినీళ్లు- చల్లనీళ్లు: హ్యాండ్ వాష్ పనితీరును నీటి ఉష్ణోగ్రత ఏమాత్రం మార్చదు. సూక్ష్మక్రిములు సబ్బు ప్రభావంతో చనిపోతాయి. నీళ్లు అవి వేడివైనా, చల్లటివైనా సబ్బు వదిలిపోవడానికే అని గుర్తుంచుకోవాలి. చేతులు కడుక్కునే విషయంలో చల్లటి నీళ్ల కంటే వేడి నీళ్లు ప్రయోజనకరమని శాస్త్రీయమైన ఆధారాలైతే లేవు.

శానిటైజేషన్-హ్యాండ్ వాష్: హ్యాండ్ వాష్ (సబ్బు) స్థానాన్ని శానిటైజర్ భర్తీ చేయదు. సబ్బుతో చేతులు కడుక్కోవడంతో వచ్చే ఫలితం శానిటైజర్ ద్వారా ఒనగూరదు. అన్ని సూక్ష్మక్రిములతో పోరాటానికి సబ్బుతో చేతులు కడుక్కోవడం సమర్థంగా పనిచేస్తుంది. శానిటైజ్ చేసుకోవడం దీనికి ప్రత్యామ్నాయం కాదు. కాబట్టి, చేతులను సబ్బుతో కనీసం 20 సెకండ్లు కడుక్కోవాలి. ఇలా చేస్తే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మక్రిముల నుంచి తగిన రక్షణ లభిస్తుంది.

పద్ధతి అవసరం లేదా: చేతులను సరైన పద్ధతిలోనే కడుక్కోవాలి. అరచేతులు, వెనకభాగం, వేళ్ల మధ్య, బొటనవేలు, గోళ్ల భాగం, మణికట్టు ఇలా అన్ని భాగాలను సబ్బుతో కనీసం 20 సెకండ్లు కడుక్కోవాలి. ఆ తర్వాత శుభ్రమైన తువాలుతో తుడుచుకోవాలి. సరైన విధానం వైద్యుడి ద్వారా తెలుసుకొని ఆచరించడం మేలు.

వాష్‌రూం తర్వాత వంటకుముందు: వాష్‌రూంకు వెళ్లివచ్చిన తర్వాత, వంటకు ముందు చేతులు కడుక్కోవాలని సాధారణంగా అనుకుంటారు. అయితే ఇది పరిసరాల్లో మనం ముట్టుకునే వస్తువులను బట్టి ఆధారపడి ఉంటుంది. రైళ్లు, బస్సులు, బాగా జనం ఉన్న ప్రదేశాలు, పెంపుడు జంతువులను తాకినప్పుడు, తలుపు హ్యాండిల్స్, ఫర్నిచర్, స్విచ్చులు, లిఫ్ట్ బటన్లు ఇలా ఎక్కువమంది వాడే వస్తువులను పట్టుకొన్నప్పుడు, మీ ముఖం, కండ్లు, ముక్కు తాకిన సందర్భాల్లో, గ్లవ్స్ ధరించడానికి ముందు ఆ తర్వాత కూడా చేతులు శుభ్రంగా కడుక్కోవాల్సిందే.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు



**ప్రత్యక్ష సాక్షి, సుల్తానాబాద్**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శివం కన్వెన్షన్‌లో సుల్తానాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ బాకం సాయికిరణ్ – గౌతమి వివాహ వేడుకలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పాల్గొని నూతన వధూ వరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు , ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ , వైస్ చైర్మన్ అంతటి పుష్పలత , కౌన్సిలర్లు , సర్పంచ్ లు పలువురు పాల్గొన్నారు.

# జగిత్యాల పాత బస్టాండ్ వద్ద పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలి

## జగిత్యాల ప్రజాభివృద్ధి సేవా సంఘం డిమాండ్



**ప్రత్యక్ష సాక్షి జగిత్యాల టౌన్**

జగిత్యాల పాత బస్టాండ్ వద్ద పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలని జగిత్యాల ప్రజాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు సూరజ్ శివ శంకర్ డిమాండ్ చేశారు ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్లకు బైకులు ఆటోలు వెస్పాలు అంబులెన్స్ లాంటి చిన్న వాహన వాహనములకు మాత్రమే ఈ పెట్రోల్ పంప్ వాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జగిత్యాల పట్టణం లోని పాత బస్టాండ్ ప్రక్కన పోలీస్ క్వార్టర్స్ పక్కన గతంలో పోలీస్ శాఖ ఆధ్వ ర్యంలో పెట్రోల్ పంప్ ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రతిపాదించినారు లేదా ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ పోస్టుమార్టం గది ప్రక్కన పాత బస్టాండ్ స్థలంలో పెట్రోల్ పంప్ ఏర్పాటు చేయాలి మూడు ప్రభుత్వ ఓల్డ్ హై స్కూల్ మూలమలుపు స్థలం ధర్మపురి రోడ్డు పక్కన పెట్రోల్ పంపు ఏర్పాటు చేయాలని ఆలోచన చేసినప్పటికీ ని ఇంతవరకు అది అమలు కాలేదని ఆయన వెల్లడించారు గతంలో జగిత్యాల రెవెన్యూ డివిజన్ ఉండగా ఇప్పుడు జిల్లా కేంద్రమైనందువల్ల ప్రజల రాకపోకలు అధికమై వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల ప్రజాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు సూరజ్ శివశంకర్ ఆధ్వర్యంలో సభ్యులు సమావేశమై ప్రజాభిప్రాయ సేకరణ చేసి పాత బస్టాండ్ వద్ద తక్షణమే పెట్రోల్ పంప్ ఏర్పాటు చేయాలని తీర్మానం చేసి కోరనైనది. గత 45 సంవత్సరాల నుంచి ఏ నాయకుడు ఈ పెట్రోల్ పంపు గురించి పట్టించుకోకపోవడం శోచనీయం. తక్షణమే పాత బస్టాండ్ వద్ద పెట్రోల్ పంప్ ఏర్పాటు చేయాలని కోరు తున్నాము. ఈ సమావేశంలో సూరజ్ శివ శంకర్, పిల్లి బాలకృష్ణ, పడాల శ్రీనివాస్, గైని లచ్చన్న, మాకు రాజలింగం, రాజేశ్వర్, వెంకటాద్రి, కోర్కంటి దయాకర్ మల్లయ్య, అంజయ్య, రాధా కిషన్, ప్రభాకర్, రషీద్ మిస్సక్ అహ్మద్ కళావతి కనకధారా తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# సిరిగాద నర్సయ్య స్మారక సాహిత్య పురస్కారాన్ని అందుకున్న వైరాగ్యం..




**ప్రత్యక్ష సాక్షి హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణ ఐఏఎస్ చేతుల మీదుగా శ్రీ సిరిగాద నర్సయ్య స్మారక సాహిత్య పురస్కారాన్ని కరీంనగర్ కు చెందిన కవి, రచయిత ,విమర్శకులు భవానీ సాహిత్య వేదిక అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్ అందుకున్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వై. రామకృష్ణారావు అధ్యక్షతన హైదరాబాదులోని శ్రీ త్యాగరాయ గాన సభ కళా సుబ్బారావు కళా వేదికపై జరిగిన సాహితీ కిరణం 17 వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై కామారెడ్డికి చెందిన ప్రముఖ కవి సిరిగాద శంకర్ తన తండ్రి సిరిగాద నర్సయ్య పేరిట నెలకొల్పిన స్మారక సాహిత్య పురస్కారాన్ని కరీంనగర్ కు చెందిన వైరాగ్యం ప్రభాకర్ కు అందించారు. ఈ సందర్భంగా సాహితీ రంగంలో శతాధిక గ్రంథ ప్రచురణలతో ఎంతోమంది కవులను ప్రోత్సహిస్తూ సాహిత్య సేవ చేస్తున్న వైరాగ్యం ప్రభాకర్ ని అభినందించారు..

సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు సభను ప్రారంభించగా సాహితీ కిరణం సలహాదారులు పెద్దూరి వెంకట దాసు కార్యక్రమాన్ని ముందుకు నడిపించారు. వంశీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు శిరోమణి డాక్టర్ వంశీ రామరాజు, కాకినాడకు చెందిన సాహితీ స్రవంతి అధ్యక్షులు జానకిరామ్ చౌదరి పాల్గొన్న సభలో కోమల సమన్విత కూచిపూడి నృత్యాలయం వారు కూచిపూడి నృత్య ప్రదర్శనని ఘనంగా ప్రదర్శించి ఆహుతులను ఆహ్లాదపరిచారు. ప్రతిష్టాత్మకమైన పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా కరీంనగర్ కు చెందిన పలువురు కవులు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు వైరాగ్యం ప్రభాకర్ ని అభినందించారు.

# సి.ఈ.ఆర్ క్లబ్‌లో ఎన్.సి.డబ్ల్యూ.ఏ ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహణ..

**పల్లె సమ్మయ్య ప్రత్యక్ష సాక్షి మందమర్రి**

మందమర్రి సి.ఈ.ఆర్ క్లబ్ ఆవరణలో మందమర్రి ఏరియాకు చెందిన ఎన్.సి.డబ్ల్యూ.ఏ ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన క్వార్టర్ల కేటాయింపు కౌన్సెలింగ్‌ను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమం వివరాలను అధికారులు వెల్లడిస్తూ మొత్తం 109 క్వార్టర్లు అందుబాటులో ఉండగా వాటి కోసం 175 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని నిబంధనల ప్రకారం సీనియారిటీ ప్రాతిపదికన పారదర్శకమైన పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించి 27 మంది అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో ఎస్ ఓ టు జి ఎం జి యల్ ప్రసాద్, డి వై పి ఎం విజయ్ సందీప్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్



కార్తీక్, పర్సనల్ డిపార్ట్ మెంట్ ఓఎస్ రాజలింగు, మేనేజ్మెంట్ ట్రైనింగ్ సివిల్ ఆర్.వీణ పర్సనల్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొని కేటాయింపు ప్రక్రియను పర్యవేక్షించారు.

# విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

## ఇబ్రహీంపట్నం ఎస్సై నవీన్ కుమార్

**గూడ రమేష్, ప్రత్యక్ష సాక్షి, ఇబ్రహీంపట్నం**

విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ఎస్సై నవీన్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రగ్స్ కు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సంజీవ్, కళాశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# సర్ ప్రక్రియపై బూత్ లెవల్ ఏజెంట్లు పూర్తి అవగాహనతో పనిచేయాలి : డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



**సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్**

ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై ప్రతి కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్ పూర్తి అవగాహనతో, బాధ్యతా యుతంగా పనిచే యాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమ కొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం లో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బి ఎల్ ఎ లు చొరవ చూపాలని కోరారు.

సర్ ప్రక్రియలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై ఏజెంట్లు నిరంతరం అలర్ట్‌గా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితా ను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాం టి అక్రమాలకు తావులేకుండా పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగస్వాములు కావాలని దిశానిర్దేశం చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆత్మకూరు గ్రామ సర్పంచి పర్వతగిరి మహేశ్వరి రాజు గారు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఆయా పోలింగ్ బూత్‌ల లెవల్ ఏజెంట్లులు పాల్గొన్నారు.

# పట్టా భూమిపై కొంతమంది కావాలని రాద్ధాంతం చేయడం సరైంది కాదు

## 70 ఏళ్లుగా పట్టాదారులే ఉన్నారు.. పట్టాదారు జిన్న శ్రీనివాస్ రెడ్డి



**ప్రత్యక్షసాక్షి, సుల్తానాబాద్**

సుల్తానాబాద్ మండలంలోని కనుకుల శివారులో గల సర్వే నంబర్ 221 బై 2లో ఉన్న పట్టా భూమిపై కొందరు కావాలని రాద్ధాంతం చేయటం సరైనది కాదని పట్టాదారు జిన్నా శ్రీనివాసరెడ్డి అన్నారు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1952 నుండి ఈ సర్వే నంబర్ లో ఉన్న 11 ఎకరాల 23 గుంటల భూమి ఉద యరాజు శ్రీనివాసరాజు దగ్గర నుండి ఉదయరాజు లలి తా భాయ్ కి మారిందని అనంతరం ఒంటెల శంకర్ రెడ్డి కి బదిలీ అయిందని, అనంతరం జిన్నా శ్రీలతకు నిబం ధనల ప్రకారం సబ్ రిజిస్టర్ ద్వారా రిజిస్ట్రేషన్కు వెళ్లడం జరిగిందన్నారు. సబ్ రిజిస్టర్, ఆర్డీవో క్లియరెన్స్ ఇచ్చిన అనంతరం 5 లక్షల 50 వేల రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి జిన్నా శ్రీలత పేరుపై 2012లో రిజిస్ట్రేషన్ చేప ట్టడం జరిగిందని తెలిపారు. గతంలో ఈ భూమిని చదు ను చేసేందుకు 50 లక్షల రూపాయల వరకు ఖర్చు పెట్టానని పేర్కొన్నారు. నీటి నిల్వలు లేకపోవడంతో భూమి కాలిగా ఉండడంతో కనుకుల సొసైటీ వారు రైతులకు వడ్లు కొనుగోలు కేంద్రాలకు అద్దెకు తీసుకున్నా రని, అద్దె ఏడాదికి 30 వేల రూపాయల అద్దె చెల్లించేం దుకు అంగీకార పత్రం సైతం రాసిచ్చారని తెలిపారు. అనంతరం నాలా కన్వర్షన్ పొందా మన్నారు. కావాలని కొందరు తమ రాజకీయ లబ్ధికోసం తమ భూమిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఎక్కడ తాను అవినీతికి పాల్పడలేదని పూర్తి ఆధారాలతో సహా కొనుగోలు చేశానని ధ్రువీకరణ పత్రాలను చూపి ంచారు. 70 ఏళ్లుగా వివిధ వ్యక్తుల వద్ద నుండి చేతులుమారాయని, పూర్తిస్థాయిలో పట్టాదారు పాస్ పుస్తకాలు ధ్రువీకరణ పత్రాలు కలిగివున్న భూమిని ప్రభుత్వ భూమి గా కొందరు ఆరోపణలు చేయడం సమంజసం కాదని తెలిపారు. అధికారులు పూర్తి పేపర్లు పరిశీలిం చిన అనంతరమే రిజిస్ట్రేషన్లు చేపట్టారని, ఆరోపణలు చేస్తున్న వారు దీనిని అర్థం అర్థం చేసుకోవాలని భూమి పట్టాదారు జిన్న శ్రీనివాస్ రెడ్డి తెలిపారు....

# దివంగత మండల రాములు ఘనంగా కురుమ రామిరెడ్డి స్మారక సభ

## రామిరెడ్డి స్మారక సభలో ప్రముఖులు



**ప్రత్యక్ష సాక్షి రంగశాయిపేట**

వరంగల్ నగరంలోని రంగశాయిపేట ఉర్సు రోడ్డులో గల గ్రాండ్ సిటీ ప్యాలెస్‌లో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివంగత మండల రాములు, కురుమ రామిరెడ్డి స్మారక సభ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ అధ్యక్షత వహించారు.

ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ మాట్లాడుతూ దివంగత మండల రాములు, కురుమ రామిరెడ్డి గొప్ప శ్రమజీవులు, కర్తవ్యనిష్ఠ కలిగిన వ్యక్తులని కొనియాడారు. మండల రాములు వరంగల్‌లోని ఆజంజాహీ మిల్స్‌లో ఎంతో నిబద్ధతతో సేవలందించి 1991 సంవత్సరంలో పదవీ విరమణ పొందారని తెలిపారు. ఆయన శ్రమకు ఎప్పుడూ వెనుకాడకుండా నిజాయితీతో జీవించారని పేర్కొన్నారు. మరణానంతరం నేత్రదానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచారని, ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

బీసీ మేధావుల తెలంగాణ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు మాట్లాడుతూ మండల రాములు బీసీ కురుమ సమాజానికి ఆదర్శప్రాయ వ్యక్తి అని అన్నారు. కష్టపడి పనిచేస్తేనే కుటుంబానికి జీవనోపాధి కల్పించవచ్చనే నమ్మకంతో జీవించారని పేర్కొన్నారు. నేత్రదానం ద్వారా ఆయన సమాజానికి గొప్ప సందేశాన్ని అందించారని, ప్రజలు కూడా అవయవ దానంపై చైతన్యం పెంపొందించుకొని ముందుకు రావాలని కోరారు. తెలంగాణ శాసనసభ ఉపాధ్యక్షులు డాక్టర్ బండా ప్రకాష్ మాట్లాడుతూ మండల రాములు ఆజంజాహీ మిల్స్‌లో అంకితభావంతో పనిచేసిన కార్మికుడని, జీవితాంతం కష్టపడి పనిచేసి అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఆయనకు తన వ్యక్తిగతంగా ఘన నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు రామగుండం 2 ఏరియా ఏఐటియుసి వైస్ ప్రెసిడెంట్ జిగురు రవీందర్ మాట్లాడుతూ రాములు మామగారు



రంగసాయిపేట ఉర్సు కరీమాబాద్ తిమ్మాపూర్ తదితర ప్రాంతాల ప్రజలలో కురుమ రామ్ రెడ్డి అనే పేరుతో ప్రజల్లో గుర్తింపు పొందిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు కరేటి శంకర్ రావు, సంపత్ రావు, విశ్రాంత డీఎఫ్‌వో ఖాజీపేట పురుషోత్తం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చాకిలం ఉపేందర్, న్యాయమూర్తి కంచ ప్రసాద్, మండల హేమంత్ కుమార్, జర్నలిస్టు శంకేషి శంకర్ రావు, డాక్టర్ తాళ్ల రవి, చీకటి సమ్మయ్య, గుండు పూర్ణచందర్, బీసీ మేధావుల ఫోరం సభ్యులు వీరస్వామి, డాక్టర్ కొంతం కృష్ణ, వడ్నాల నరేందర్, రావుల బాలరాజు, కోరే కుమారస్వామి బ్రదర్స్ జిగురు శ్రీనివాస్ బుర్రి సురేందర్ శేఖర్ చీర వాసుదేవ్ మిత్ర పరపతి సంఘ సభ్యులు జనతా పరపతి సంఘం సభ్యులు పూర్వ మిత్ర పరపతి సంఘ సభ్యులు వినాయక పరపతి సంఘం సభ్యులు జై హనుమాన్ పరపతి సంఘ సభ్యులు మరియు మురికి రవి నంద రమేష్ మండల చిరంజీవి ప్రభాకర్ మండల్ యాదగిరి గోపిరెడ్డి సురేష్ నరిగే శీను దయ్యాల వీరేశం కొండ్రెడ్డి నవీన్ రెడ్డి దివంగత మండల రాములు కుమారులు మండల పరశు రాములు, మండల నరసింహ రాములు తదితరులు పాల్గొని నివాళు లు అర్పించారు. పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు సభలో పాల్గొన్నారు.

printed,published and owned by Kandukuri Parameshwar Rao, printed at Rimsha printers,. H .no 5-16/1, Algunoor,Mandal Thimmapur, Dist Karimnagar (TS) place of Publication H.NO.1-2-31/4/B/1 krishna nagar jagital dist(TS).cell no.99892 88546, Editor K.Parameshwar rao. RNI No.APTEL/2011/38267. kprao1961@gmail.com